72118701

# ప్రబోధ ౩౦

మనసే ముక్తికి ముఖ్యము
మనసే నరకంబు తెచ్చు మైమరపించున్.
మనసే కారణంబు మరియెందుపుండిన
ఇల్లు అడవి ముక్తి నియ్యలేవు
మనసులేని వాడు మందిరమున నున్న
కానన మున నున్న కార్యమేమి?

దివ్యాత్మస్వరూపులారా!

ఇంద్రియములతో కూడిన యీ పాంచభౌతికమైన శరీరము మనసుకంటె వేరైనదికాదు. మనసు తన వి[illegible]సార్థమై యేర్పరచుకొన్న కవచమే యీ శరీరము. అన్ని దేహములకు మనసే మూలాధారము. నీరులేని పంట యొక్క అస్థిత్వము యెంత మిథ్యా మాత్రమో మనసులేని శరీరము యొక్క మిథ్యత్వము కూడను అట్టి అకృత్యాన్ని పొందుతూవున్నది. మనసు యొక్క తత్వమును ప్రతీ వ్యక్తి గుర్తించి వర్తించినప్పుడే దాని యొక్క స్వస్వరూపాన్ని గుర్తించటానికి వీలవుతుంది. ప్రపంచములో సర్వవ్యాపారములకు, కార్యకలాపములకు యీ మనసే మూలకారణము. పంతులు లేని బడి దేవుడు లేని గుడి యే విధమైన వ్యర్థమవుతుందో అదేవిధముగనే మనసులేని శరీరము కూడను నిరుపయోగమవుతుంది. సామాన్యముగా యీ మానవులు యీ మనసు శరీరముతో బంధింపబడినదనే విశ్వసించి కేవలము యీ శరీరపోషణార్థమై యనేకవిధమైన పాట్లు పడుతుంటారు. సమస్త భోగభాగ్యములకు యీ శరీరమే మూలకారణమని విశ్వసించి యిందులోనే బంధింపబడుతున్నాడు. మానవుడు యెన్నివిధములైన సేవలు సల్పినప్పటికి వున్నతస్థాయిని చెందలేడు.

మనస్సనేది కేవలము ఒక పరిశుద్ధమైన తెల్లని కాగితము వంటిది కాదు. ఇందులో యనేక జన్మల యొక్క సంకల్పములు ముద్రింపబడి వుంటున్నవి. అనేక కర్మల యొక్క ఫలితము కూడను యిందులో ముద్రింపబడి వుంది. కనుక నే సంకల్పమయమైనదే యీ మనసు. మానవుని యొక్క ట్లసమయమునందు, ఆపత్సమయములందు యీ సంకల్పములు యనేకమైన వుపకారములు సల్పటానికి సిద్ధముగా వుంటాయి. ఇవి సత్సంకల్పములతో కూడినప్పుడు మానవుని యెంతటి వున్నతస్థాయికైనను గొనిపోతుంది. సంకల్పముల బీజమునుండి యే కర్మ అనే ఫలము ఆవిర్భవిస్తుంది. కర్మబీజమునుండే అభ్యాసము అనే ఫలము పుడుతుంది. ఈ అభ్యాసమనే బీజమునుండియే శీలము అనే ఫలము ఆవిర్భవిస్తుంది. ఈ శీలమనే బీజమునుండియే

అదృష్టమనే ఫలమును మనము అందుకుంటున్నాము. ఈ అదృష్టమనే ఫలమును మనము ఆరగించాలనుకున్నప్పుడు పవిత్రమైన గుణశీలుడు కావాలి. గుణశీలుడుగా నిర్వర్తించవలెనన్న అతనికి సరైన సదభ్యాసములు అభివృద్ధి పరచుకోవాలి. సదభ్యాసములను మనము అనుభవించవలెనన్న సత్కర్మలలో మనము ప్రవేశించాలి. సత్కర్మలయొక్క ఫలితమును మనము అందుకొనవలెనన్న సంకల్పములు సరైన సంకల్పములుగా వుంటుండాలి. ఏతావాతా మానవుని యొక్క అదృష్టదురదృష్టములంతా మానవుని యొక్క సంకల్పములపైననే ఆధారపడి వుంటున్నది. సత్సంకల్పములనే అభివృద్ధిపరచుకున్న అతనికంటె అదృష్టవంతుడు మరొకడుండడు. అతడు అనుభవించలేని ఆనందమును కాని, పొందలేని స్థానముగాని, చెందలేని సంస్కృతిగాని యేమాత్రము మరొకటి వుండదు. అట్లుకాక కేవలము దుస్సంకల్పములనే మనము అభివృద్ధిపరచుకున్న దుష్టులై, దుర్మార్గులై, దురాచారపరులై కేవల మహానష్టితిని అనుభవించక తప్పదు.

కనుక మానవుని యొక్క స్థితిగతులన్నియు కూడను తనయొక్క సంకల్పములపైననే ఆధారపడి వున్నది. ఈ సత్సంకల్పములనేవి కేవలము సత్సంగమునుండియే లభ్యమౌతాయి. సత్సంగము చేత సత్సంకల్పములు పోషించుకున్నప్పుడు సదభ్యాసములో మన జీవితమును సార్థకము గావించుకుంటాము. అయితే యీనాడు మనయొక్క సంకల్పములు మానవునికి తోచినట్లుగా, తాను అభివృద్ధి పరచుకున్నాడేగాని యిది మంచి నా చెడ్డనా అనే విచారణాశక్తిని శూన్యుడై వుంటున్నాడు. కిరాతకునిగా వుండిన రత్నాకరుడు మహర్షులయొక్క సంపర్కము చేత తాను రామాయణకర్తగా, వాల్మీకిగా మారిపోయాడు. అంగుళీకుడు అనే మహా దుష్టుడు కూడను బుద్ధునియొక్క సంపర్కము చేతను, సద్బోధలచేతను, సత్సంకల్పములు పెంచుకొని తాను కూడా పరమ భక్తునిగా మారిపోయాడు. జగాయి, మాదాయి అనే మహా దొంగలు కిరాతకులైనవారు చైతన్యుని యొక్క సంపర్కము చేత సద్గుణముల చేత తామసంకల్పములు పెంచుకొని వారు కూడను జీవితము సార్థకము గావించుకొనుచున్నారు. కనుకనే మానవునికి సత్సంగమనేది అత్యవసరము. సంఘము యెట్టిదో తనయొక్క సంకల్పములు కూడను అట్టివి గా రూపొందుతాయి. అదియే Tell me your company I shall tell you what you are. కనుకనే మనము మంచివారిలో చేరాలి. సద్గుణములను పెంచుకోవాలి. సదభ్యాసములు చెయ్యాలి. సత్కర్మలలో ప్రవేశించాలి. ఈ అన్నింటికిని సంకల్పములే మూలకారణము. కేవలము ఒక భారత దేశమునందే కాక యితర దేశములందు కూడను యిట్టి సత్సంకల్పముల చేత సరైన స్థితిని పొంది వారు సంకల్పములు సార్థకము గావించుకున్న వ్యక్తులు యనేకమంది కలరు.

పూర్వము యింగ్లండులో కవర్లపైన అడ్రసులు రాసి వారు యిచ్చే కానీ, అరకానీ తాను పుచ్చుకొని యీ విధముగా జీవితము గడుపుతూ వుండేటువంటి వాడు. అతను నిరంతరము

దైవచింతనలో తన హృదయాన్ని నింపుకుంటూవుండేవాడు. ఆ ఎడ్రసు రాసి తిరిగి వాళ్ళకు యిచ్చే
సమయములో God bless you అనేవాడు. కాని కొన్ని సమయములలో పల God is great
అనేవాడు. మరి కొన్ని సమయములలో పల Trust in God అనేవాడు. కాని యితని జీవితము
దినదినమునకు దిగజారిపోతూ వచ్చింది. బ్రతకటమే కష్టమైంది. అయితే అతని యొక్క సంక
ల్పములు పవిత్రమైనవిగా వుండటంచేత అతను దినదినమునకు అభివృద్ధిగాంచుతూ వచ్చి
డు. అతనే కొంతకాలములో పల బ్రిటిషు దేశమునకు Prime minister గా అయ్యాడు. అత
నే James Macdonald. అయితే యిలాంటి వ్యక్తులు యింకను యెంతమందో జగత్తులో వుంటు
న్నారు అయితే కొంతమందికి యిట్టి విషయములలో విశ్వసించే ప్రాప్తి కూడను వుంటుండదు. విశ్వాస
ముకూడను ఒక అదృష్టమే. అదృష్టవంతులు యిట్టి పవిత్రమైన విషయములు విశ్వసిస్తూవుంటారు.
ఏదో కొన్ని చరిత్రల పవిత్రతను మాత్రమే విశ్వసించి తమ జీవితము దానికోసమై ప్రాకులాడేదానికి
ప్రయత్నిస్తుంటారు. అయితే నేటి కాలమునందు కూడను యిలాంటి పవిత్రమైన సంకల్పముల ప్ర
భావాన్ని ప్రత్యక్షముగా నిరూపించిన వ్యక్తులు కూడను యనేకమంది వుంటున్నారు.

మద్రాసు రాష్ట్రములో కుగ్రామములో వున్న యిరువురు అన్నదమ్ములలో పెద్దవా
డైన సోదరుడు చాలా దుర్గుణములు కల్గి సదాచారముల చేత, సత్కర్మలలో ప్రవేశించినవాడు.
అయితే వీని దిబొదకులుంబము. రెండవవాడు దుష్టులతో చేరి కాలమునంతా వ్యర్థము, కర్మ
లంతా అపవిత్రముగా ఆచరిస్తూ వుండేవాడు. దుస్సంగము అతిసులభముగా లభిస్తుంది. సత్సం
గము అంత సులభముగా మనకు లభించేదికాదు. కొండనుంచి గుండును కాలితో నెడితే
కూడను క్రిందపడిపోతుంది. కాని క్రిందవుండినటువంటి గుండును కొండపైకి తీసుకుపోవ
టము చాలా కష్టము. అదేవిధముగనే వున్నతస్థాయిని మనము సంపాయించుకోటము
అతికష్టము. అధోగతికి దిగజారిపోటము సులభము. అయితే యీ సోదరుడు దుష్టుల
తో చేరి కొంతకాలములో భ్రష్టుడయాడు. ఈ దుష్టస్నేహితుల ప్రోత్సాహము చేతను, ప్రోత్సాహ
ము చేతను అన్నపైన కొంత విరోధము గావించుకున్నాడు. కేడపటికి వున్న ఒక చిన్న యి
ల్లుపైన కూడను అతను దావావేసి అన్నను కోర్టుకు లాగాడు. కాని నిజముగా అన్న స్వయము
గా సంపాయించుకున్న గృహమది. తాతలది కాని తండ్రులదికాని కాదు. అన్యాయముగా కోర్టు
కు లాగి అన్నను యనేకవిధములైన బాధలు పెట్టాడు. అందులో కొంతమంది లాయర్లు
ధనము కోసమై లాంగి యీ కోర్టులో వేసిన కేసును అపజయము గావించారు. కోర్టులో ప
లి అన్న ఓడిపోయాడు. సత్యమునకు కాలమే లేదా ధర్మమునకు అవకాశమే లేదా అని నిరంతర
ము చింతించి చింతించి అతను ప్రాణము వదిలాడు. అతనికి ఒక కుమారుడు భార్య వుండే
వారు. ఆ తల్లి కూడను చాలా బాధపడి ఆ కుమారుని తీసుకొని యేదో ఒకవిధముగా ఆ కుమా
రుని అభివృద్ధిగావించాలని వుద్దేశ్యముతో మద్రాసు పట్టణము వచ్చిచేరారు. తినటానికి

72I118704.

తిండి లేక, వుండటానికి యిల్లు లేక యనేక విధములుగా కూడను యిరువురు బాధలు పడ్డారు. కాని కడుపటికి యెక్కడో కూలినాలి చేసుకొని తాను సంపాదించి కొడుకును యేదో ఒక విధముగా అభివృద్ధి గావించాలని ప్రయత్నము చేసింది. కుమారుడు కూడను వున్నవారిని ఆశ్రయించి పూటకూళ్ళలో తిని, బజార్లలో వెలిగే లైట్లవమందర కుర్చొని చదువు ప్రారంభించాడు. టీ కాఫీ తాగటానికి ఒక కానైనా అతని జేబులో లేదు. కాని అదే విధముగా కష్టపడి చదివి కుళాయి నీళ్లు త్రాగి అతని జీవితము కాపాడుకుంటూ వచ్చాడు. ఈనాడు యింటర్మీడియట్ నే పూర్వము FA అని పిలచేవారు. ఏదో కష్టపడి FA పాస్ చేశాడు. అతడు వుత్తీర్ణుడయ్యాడనే విషయము తల్లికి తెలిసింది. పట్టలేని ఆనందముతో కొడుకును ఒడిలో పెట్టుకొని బాలా ఆనందించింది. అప్పుడు తల్లి సత్సంకల్పముల చేత ఆ కుమారుని ఆశీర్వదించింది. నాయనా! అన్యాయ అక్రమ అనాచార అక్రమములు ప్రబలిపోవటం చేతను సత్యమునకు ధర్మమునకు కాలము లేకపోవటము చేతనే నీ తండ్రి యీ విధమైన అశాంతితో మరణించాడు. ధర్మదేవత కూడను యీనాడు క్రోధము పూనింది. ఈనాడు లోకములో న్యాయమనేది యేమాత్రము కూడను కనుపించటము లేదు. చదువరులు కేవలము స్వార్థము, స్వప్రయోజనము నిమిత్తమై యీ ఉద్యోగములు చేయుచున్నారే గాని న్యాయము, ధర్మము, దేశమునకు నీతి నిజాయితీ అందించటానికి తగిన కృషి చేయుంటలేదు. ఎవరు యెక్కువ ధనమిస్తే వారి వైపున న్యాయమని వాదిస్తారు లాయర్లు. వానికంటె యెక్కువ ధనము ప్రతివాది యిస్తే అతని వైపున న్యాయమని వాదిస్తారు లాయర్లు. ఈ విధముగా చేసి మనవలె యెన్ని కుటుంబములు నాశనము చేసిన లాయర్లు జగత్తునందు యెంత మంది వుంటున్నారో జగత్తునందు. కాని అలాంటి లాయర్ల యొక్క బిడ్డలు కాని కుమారులు కాని సుఖ జీవనము గడపిన వారు నేను యింతవరకు కంటితో చూడలేదు. ఏదో కొన్ని రోగములో, బాధలో, యింకొ విధమైన రౌడీ ఫ్రెండ్షిప్ తో కలసి యీ యొక్క సంపాదించిన ఆస్తినంతా నిర్మూలము గావించుకొనే వారిని నేను చూచాను. కనుక మరణించిన తండ్రికి నీవు శాంతిని చేకూర్చాలనుకొన్నప్పుడు నీవు యిట్లు నా సరియే LLB చదివి నీవు లాయరై శాశ్వతమైన ధర్మాన్ని నీవు ప్రపంచానికి చాటాలని ఆశీర్వదించింది. తల్లి యొక్క ఆశీర్వాదములు పొంది, తల్లి ఆజ్ఞ ప్రకారము LLB కి కట్టుకున్నాడు. తల్లి మాటలను హృదయములో పెట్టుకున్నాడు. క్షణక్షణము తల్లి యొక్క బోధనలంతా కర్ణములలో వింటున్నారు. కష్టపడి చదివాడు. వుత్తీర్ణుడయ్యాడు. ప్రాక్టీసు ప్రారంభించాడు. కాని సత్సంకల్పము నా తండ్రి యొక్క ఆత్మకు శాంతి చేకూర్చాలి. యిది నా తల్లి ఆజ్ఞ అనుకున్నాడు. నా blood నా food నా head నా parents gift. కనుక నా bloodనంతా కూడను తల్లితండ్రులకు అర్పితము గావించాలి. అదియే మాతృదేవోభవ పితృదేవోభవ అని. తల్లితండ్రులను సంతోషపెట్టే నిమిత్తమై ఆ సత్సంకల్పములను నిరంతరము పోషించుకుంటూ వచ్చాడు. సత్సంకల్పములు యెనాటికి నశించేవి కాదు. మనిషి మరణించినా కూడను మన సంకల్పము మరణించేది కాదు. సంకల్పములు చాలా బలమైనవి. పవిత్రమైనవి. శాశ్వతమైనవి. కొంతకాలము

72111 8705

లోపలనే భారతదేశము స్వాతంత్ర్యము నందుకొంది. స్వతంత్రము వచ్చిన తరువాత మద్రాసు హైకోర్టుల్ ప్రధానన్యాయమూర్తి యితనే అయ్యాడు. అతనే ముత్తుస్వామి అయ్యర్. తన కుమారుడు ప్రధానన్యాయమూర్తి అయ్యాడని ఆనందముతో కొంతకాలములోపలనే ఆ తల్లి కన్నుమూసింది. చూచారా! తల్లి యొక్క సంకల్పమ్ము, కుమారుని యొక్క సంకల్పము యెంత పవిత్రమైన విజయాన్ని అందించిందో. ఆనాటి నుండి కూడను యీ ముత్తుస్వామి అయ్యర్ గొప్ప కీర్తిని సాధించాడు.

కీర్తి యెలాంటిదంటే ప్రవాహము వంటిది. నది పుట్టినప్పుడు చాలా చిన్నదిగా వుంటుంది కాని క్రమక్రమముగా అది గొప్పగా అభివృద్ధిగాంచుతుంది. సంకల్పము లేప్రధానమైన ఇచ్ఛాశక్తిని అభివృద్ధిపరుస్తుంది. ఇచ్ఛాశక్తి నుండియు, వాక్‌శక్తి, విచక్షణాశక్తి, మేధాశక్తి విచారణాశక్తియిలాంటి శక్తులన్నీ ఇచ్ఛాశక్తి నుండి మనకు ఆవిర్భవిస్తున్నాయి. ఇచ్ఛాశక్తి పవిత్రముగా వుండినప్పుడు వాడు ఇంద్రుడు దేవేంద్రుడు కావచ్చును. కనుక యిట్టి యిచ్ఛాశక్తి ప్రతి మానవుని యందు వుంటున్నది. అయితే యీ యిచ్ఛాశక్తి క్రమక్రమేణా తరిగి పోటానికి గాని, నశించిపోవటానికి గాని కారణము యేమిటి. మానవునికి కోరికలు పెరుగుతూ పెరుగుతూ పోయే కొలది యిచ్ఛాశక్తి తరుగుతూ తరుగుతూ వస్తుంది. ఈనాడు మితిమీరిన కోరికలు కావటం చేతనే యిచ్ఛాశక్తి గతి తప్పి నడుస్తున్నది. కనుక యిచ్ఛాశక్తి తనయందు బలహీనత కావటం చేతనే మానవుడు అనుభవించవలసిన ఆనందమునుగాని శాంతిని గాని అనుభవించలేకపోతున్నాడు. ఒక్కటి ప్రత్యక్షముగా అనుభూతిలోపల తెచ్చుకోటానికి ప్రాక్టీసు చేయండి. ఒకనికి యిరవై ఆశలు వుండవచ్చు కాఫీ కావాలి. టీ కావాలి. గంజాయి కావాలి, సిగరెట్టు కావాలి, బీడీలు కావాలి, పేకాట ఆడాలి యీరకమైన ఆశలు యెన్నో వుంటున్నాయి మానవునికి. ఈ కోరికలు ఒక్కొక్క దానిని, ఒక్కొక్క దానిని తగ్గించుకుంటూ రండి. మీ యిచ్ఛాశక్తి క్రమక్రమేణా పెరుగుతూ వస్తుంది. కనుక మన యిచ్ఛాశక్తి తరిగిపోవుటకు గాని పెరిగిపోవుటకు గాని మన కోరికలే మూలకారణము. ఈ కోరికలు అరికట్టుకొనుటకు మార్గము యేమిటి మీరు విచారణ చెయ్యండి.

మీరు పుట్టక పూర్వము యీ జగత్తు యెక్కడ వుంటున్నది. పుట్టిన ప్రతి జీవి గిట్టక తప్పదు. మరణించిన తరువాత యీ జగత్తు యెక్కడ వుంది. మధ్యలో వచ్చి పోయేటువంటిదే యీ జగత్తు. చావు పుట్టుకకు మధ్య లోకనుపించేది యీ జగత్తు. ఇలాంటి జగత్తును మనము యెదురునుంచుకొని మనము దీని నిమిత్తమై ప్రాకులాడటము యెంత వెర్రితనము. ఈ జగత్తంతయూ అద్దము వంటిది. నీవు అద్దము ముందు వుండినంతవరకే నీ ప్రతిబింబము అద్దములో కనుపిస్తుంది. అద్దము ప్రక్కకు పెట్టితే నీ ప్రతిబింబమే లేదు. ఇలాంటి క్షణభంగురమైన అస్థిరమైన యీ జగత్తు కోరికల నిమిత్తమై, శాశ్వతమైన, సత్యమైన మానవ జీవితాన్ని వ్యర్థము గావించుకోటం నిరర్థకమనే సత్యాన్ని మీరు గుర్తించాలి. కనుక మనము కేవలము స్వార్థమునకు గురియై పరార్థమును విశ్వసించక, జీవితాన్ని వ్యర్థము చేసుకుంటున్నాము. అశాశ్వతమైన నీటి బుడగ వైన

721118706

నిర్మించుకున్న యీ జీవితసౌధము యేక్షణములో మునిగిపోతుందో. అందువల్లనే ఉపనిషత్తులు. ఉత్తిష్ఠత, జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత అన్నారు. అనగా అజ్ఞాననిద్రనుండి లేచి సత్యాన్ని గుర్తించుకొమని వుపదేశిస్తున్నాయి. అయితే యీవిధమైన జ్ఞానము మనకు యెప్పుడు లభిస్తుంది. మానవులందరు కూడను ఒకటే అనేసత్యానికి మనము రావాలి. సత్యమే దైవస్వరూపుడు. మనము ప్రేమించవలసినది సత్యమునే.

ఇంక యీజగత్తంతయు కూడను మిథ్యమైనది. దీనినంత కూడను మనము విశ్వసించి యనేక రకములైన పాపములను గుర్రైపోతున్నాము. ఈపాపములు ఫలితము అందించకతప్పదు. కనుక పాపభీతిని అభివృద్ధిచేసుకోవాలి. దైవప్రీతి నిపెంచుకోవాలి. సంఘములో నీతిని మనము అభివృద్ధిగావించుకోవాలి. కనుక మానవునికి ప్రధానమైన విలువలు యీమూడు మాత్రమే. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి. పాపభీతి. దీనిలోనే అహింస శాంతము మనకు లభిస్తుంది. దైవప్రీతిలో సత్యము ప్రేమ అభివృద్ధిపరుస్తుంది. సంఘనీతి యే మనధర్మము. కనుక ప్రతిమానవుడు మానవతావిలువలని సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ అనేటువంటి చిలుకపలుకులు పలికినంతమాత్రమున ప్రయోజనము లేదు. సామాన్యమైన మానవుడు నిత్యజీవితములో వున్న దైవత్వాన్ని అనుభవించటానికి ప్రయత్నించాలి. మానవతావిలువలనేవి ప్రతిమానవుడుగా జన్మించినవానికి వుండవలసినదే. మానవతావిలువలు లేకపోవటంచేతనే యీనాడు జగత్తులో యనేక విధములైన దుష్టకృత్యములు మనము చూడగలుగుతున్నాము.

లోకమందు పెక్కు భీకరకృత్యముల్
జరుగు కారణంబు అరయవలయు
స్వార్థరహితసేవ సన్నగిల్లుటచేత
అర్థరహిత వాంఛలధికమయ్యె.
పాపభీతిలేని పామరత్వము పుట్టి
దైవప్రీతిలేని దానిబుట్టి
మానవత్వముడగె మానవులందున
విశ్వశాంతికి దియె విప్లవంబు.

ఈవిధమైన విప్లవాన్ని మనము అనుభవించటానికి కారణమేమిటి? పాపభీతిలేకపోవటంచేతను, దైవప్రీతి కోల్పోవటంచేతను మానవతలో విలువలు మనము కోల్పోయినాము. ఏలాగా మానవుని యొక్క విలువలేమిటి? పాపభీతి, దైవప్రీతి యీరెండే గొప్పవిలువలు. కనుక మనము దుష్టత్వాలు, దురాలోచనలు, దుర్బుద్ధులచేత జీవితాన్ని వ్యర్థముగావించేదానితో మనము సాక్షీభూతులుగా వుండి, దూరముగా వుంటుండాలి. ఇలాంటి సుగుణములు మనము యీనాడు పోషించుకోవాలి. ఏసాధనలు చేయక పోయినప్పటికి, సేవయే గొప్పసాధనగా మనము విశ్వసించాలి. సేవకంటె మించినది

72111870T

మరొకటిలేదు. పరుల యొక్క చెడ్డనుగాని, పరుల యొక్క దుర్మార్గమునుగాని వివర్శించటానికి మనము రాకూడదు. పరదూషణ మహాపాపమైనది. ఈ పరులను దూషించిన పాపము మహారోగము. ఇది యెలాంటి నివారణలేనటువంటి రోగము. దీనికి మందులేదు.

పరదూషణ అనేది కేవలము cancer రోగము వంటిది. ఎవరినికూడను, యెవరి విషయములో కూడను విమర్శించటంకాని, దూషించటంకాని, పరిహాసించటముగాని, వారిని అగౌరవపరచటంగాని మనము చేయరాదు. ఇతరులను దూషించుటము చేత మనము యనేకవిధములైన దుర్బుద్ధులలో మునిగిపోతాము.

దూషణంబు హింస దూరంబుగా నెట్టి
దైవచింత తాను దండిపరచి
ప్రేమతోడ తాను ప్రజలను చూచిన
దైవప్రేమ తనకె దండివుండు.

కనుక మనము దూషణ, పరహింస యివి దూరముగా నెట్టటానికి ప్రయత్నించాలి.

పరుల తిట్టినంత పాపఫలంబబ్బు
విడువదెన్నటికిని విశ్వమందు
పరుడు పరుడుకాదు పరమాత్ముడేనయా
సత్యమైన బాట సాయిమాట.

ఎవరో పరుడు నాకు విరోధి అని వారిని యెవరినో మనము యిష్టము వచ్చినట్లుగా దూషిస్తాము. కాని అతను పరుడుకాదు. పరమాత్ముడే. కనుక మానవుని యందు ఒకరినొకరు ద్వేషించే దుష్టభావానికి యు మాత్రము హృదయములో అవకాశము యివ్వరాదు. అహంకారము అధికమవటంచేతనే ఆడంబరములను పెంచుకోటంచేతనే అన్నలను పరులుగా భావిస్తున్నారు. కాదు కాదు. నీ యెదురుగా వుండిన ప్రతి జీవికూడను పరమాత్మస్వరూపుడే. జగత్తంతయు కూడను నాయకుడు అతనే. సూత్రధారి, పాత్రధారి కూడను అతనే. ఎవరైనా వ్యక్తి యెదురుగా వచ్చి నిన్ను దూషిస్తున్నాడంటే నువ్వు నవ్వుతూ ఆహా! పరమాత్ముడు ఆ రూపములో వచ్చి యీ రూపాన్ని విమర్శిస్తున్నాడు. సర్వరూపములు తనవే. కాన దూషించేవాడు తానే. దూషించబడేవాడు తానే. అనేకమంది యనేకవిధములైన దుఃఖములకు గురౌతుంటారు. కాని అయ్యో నేను భగవంతుని పూజిస్తున్నానే, భగవంతుని ప్రార్థిస్తున్నానే యీ దుఃఖములు, కష్టములు, అన్యాయములు యేనాడు నాకు దూరమౌతాయి. ఈ బాధలు విమోచన చేయలేకుండా పోతున్నాడే భగవంతుడు అని బాధపడుతుంటారు మానవులు. ఇది చాలా పొరపాటు. దుఃఖములకు కన్నుముక్కు, కాళ్ళు, చేతులు లేవు. లోకవిచారములకు యీ అంగములు లేవు. మనకు అయిష్టమైనవి, అనాహతమైనవి యీ దుఃఖములు. దీనికి మనము వగచి ప్రయోజనమేమిటి? ఈ దుఃఖములు భ్రాంతులే గాని ప్రత్యక్షముగా నీకు లభించి

నవస్తువులుకాదు. భగవంతుడనేవాడు ప్రత్యేకముగా మానవునకు దూరముగాలేడు. ఏదోపురాణములు, ఇతిహాసములు, ఉపనిషత్తులు యివన్నిమనము యేదో భగవంతుడు ప్రత్యేకముగా వుండినట్లుగా యీభక్తుడు అతనిని పొందుటానికిప్రయత్నించినట్లుగామనము వింటున్నాము. ఇది సరైన భక్తికాదు. భగవంతుడవేరు నేనువేరు అని భేధ భావమువుండినంతవరకు యితనుకేవలము యేదో స్వార్థము, స్వప్రయోజనము తోనే నిండి వుంటాడు. ఈద్వైత భావమును మనము దూరమునెట్టాలి. ఏకాత్మ భావాన్ని మనము పెంచుకోవాలి. దివ్యత్వముతోనే జీవితము అంత్యము చెయ్యాలి.

ఒకరువచ్చారు. స్వామీ! బ్రహ్మసత్యం జగత్ మిథ్య అని ఉపనిషత్తులు చెప్పుతున్నాయికదా. నేను జవాబు చెప్పాను. బ్రహ్మసత్యం జగత్ మిథ్య అంటావు. ఈజగత్తును పట్టుకొనియిది మిథ్యయో సత్యమో నీకెందుకు. ఆ జగత్తును నవ్వు బాడుగకు తీసుకోలేదు. కాంట్రాక్టు తీసుకోలేదు. ఈజగత్తును జగత్తుకే వదలిపెట్టు. మొదట నీవుసత్యమోకాదో విచారించుకోమన్నాను. తానుసత్యమోకాదో అనే సత్యాన్ని తానుగుర్తించుకోలేకుండా జగత్తుమిథ్యమాలేక బ్రహ్మసత్యమా యీవిధమైన దేంట్లో మనము వాదోపవాదాలు దిగటము కేవలం వ్యర్థ జీవితముగడిపినవాడే. ఇలాంటివిచారణలో మనముయేమాత్రము ప్రవేశించకూడదు. పనిలేనివారే యీపనులంతాపెట్టుకుంటారు. ఇయ్యా కొంతమంది పూజించాలని ఒకభ్రాంతిలోవుంటారు. ఎవరినిపూజించేది. ఎవరుపూజించేది. దీనికినాపుద్దేశ్యముయేమంటే వ్యక్తిగతమైన పూజలో, వ్రతములో, ధ్యానములో, జపములో మీ యిష్టము కొలది మీరు చేసుకోవచ్చును. కానిసత్యమార్గములో మనము భగవంతుని అర్థము చేసుకోవలెనన్న భగవంతునికి పూజ అనేదిలేదు. తాను అందుకొనేవాడుకాదు. నీవుచేసేవాడుకాదు. నీవు పూజ చెయ్యాలని యెక్కువ అభిలాషనీవుంటుంటే నిన్నునువ్వుపూజచేసుకో. అదిచాలా గొప్పది. మీలోలేని దేవుడు వేరే బయట యెక్కడవుంటున్నాడు. దేవుడుయెక్కడవున్నాడని దేవుళ్లాడటానికిప్రయత్నిస్తే నీకునీవుయెంత దూరమో దేవుడునీకు అంతదూరము. నీకునీవు యెంత సన్నిహితముగావున్నావో దేవుడునీకు అంత సన్నిహితముగావుంటాడు. నీకునీవు దూరమైనవానికి దేవుడు దూరముగావుంటున్నాడు. కనుకనేనీకునీవుసమీపుడుకా. అప్పుడే నీకు దైవత్వము అనేది అర్థమవుతుంది.

ఈ మనసును అరికట్టి మనోనాశనము చెయ్యాలని మరికొంతమందిప్రయత్నిస్తుంటారు. ఇదంతా కర్మలద్వారాయేర్పడినదికనుక యీకర్మలనేను మానివెయ్యాలని అకర్ముడనని చెప్పుకుంటారు. అకర్మ అంటే యేమిటి అర్థము. కర్మలుచేయకుండా వుండటమా. కాదుకాదు. ఇదిసోమరితనము. అకర్మ అనగా అహంకారము విసర్జించటమే. అహంకారరహితముగాకర్మలుఆచరించటమే అకర్మ. ఇంకామరికొంతమంది ముక్తికోసమని ప్రయత్నిస్తున్నామంటున్నారు. అహంకారమును దూరముచేయటమే ముక్తి. ఈఅహంకారము వుండినంత

721118709

వరకు నేను బంధమే. ఈ అహంకారమును దూరము గావించుకొంటిమా బంధవిముక్తుడౌతాడు. కనుక ఈ అహంకారమనేది మమకారమనేది మనము అర్పించుకోవాలి.

ప్రతి మానవుని యందు దైవత్వము వుంటున్నాదనే సత్యాన్ని మనం గుర్తించి వర్తించాలి. ఒకడు సన్యాసి అని వేషము వేసుకుని వుంటాడు. నేను సన్యాసి, సన్యాసి అని చెప్పుకుంటూ వుంటాడు. కాని అతను నిజముగా నేను సన్యాసి అని చెప్పుకున్నంత కాలము అతను నిజమైన సన్యాసి కాడు. నేను సంసారి, సంసారి అని చెప్పుకున్నంత కాలము వాడు సంసారి కాడు. కేవలం యివి రెండు కూడను వారి భ్రాంతులే. ఆ భ్రాంతిని యే నాడు మనము విసర్జించుకొందుమో ఆనాడే నిజమైన ఆత్మ స్వరూపము. కనుక యీ భ్రాంతులను మనము దూరము చేసి సేవకంటె మించినది మరొకటి లేదనే సత్యాన్ని గుర్తించాలి. మన active workers అందరు కూడను యీ సత్యాన్ని నేటి నుండి గుర్తించు కొని, పాప భీతి, దైవ ప్రీతి, సంఘములో నీతిని మనము సాధించాలి. నిజముగా మనలో దైవ ప్రీతి నేవస్తే తక్షణమే పాప భీతి యేర్పడుతుంది. ఈ రెండూ చేరిన సంఘములో మనము నీతిని సాధించగలము. అదే మానవ జాతికి జ్యోతి. కనుక ప్రతి వ్యక్తి కూడను దైవభావాన్ని పెంచుకోటానికి ప్రయత్నించాలి. సమాజ సేవలో మనము నడుం కట్టాలి. ఈ రెండే మనకు నిజమైన మార్గములు. ప్రేమ, సేవ రెండూ రెండు రెక్కలు మనకు.

పక్షి బలమున యెగిరెడు పక్షులట్లు
ఆది విహగ మార్గంబుల ననుసరించి
చేరవలయును గమ్యంబు శీఘ్రగతిని
సద్గుణంబులు త్యాగంబు సత్యనిష్ఠ
లేని జీవుడు ప్రాణంబు లేని వాడె
సేవ చేయని జీవుడు చీకటింటి
అంధ జీవుడనుచు చెప్పవచ్చు

సేవనే లేకపోతే వాడు కేవలం అంధుడనే చెప్పవచ్చు. కనుక ప్రేమ, సేవ రెండూ మనకు రెండు కన్నులు. ప్రేమ, సేవ యివి రెండే మనకు రెండు రెక్కలు. ఈ రెండు రెక్కలను మనము సాధించితిమా మన జీవితము గమ్యాన్ని సులభముగా చేరిపోతుంది. సత్యాన్ని గుర్తిస్తాము. సత్య జీవితాన్ని గడుపుతాము. కనుక మన యీ సేవకులందు యీ రెండూ కూడను చాలా అవసరంగా మనము పెంచు కోవాలి.

ప్రేమ, సేవ. కేవలము దైవ ప్రేమ మటుకే కాదు. దైవము సర్వత్రా వుంటున్నాడు. ఈశావాస్యమిదం సర్వం. అందరిని ప్రేమించాలి. కేవలం ప్రేమించినట్లుగా నటించి ద్వేషించటం చాలా దోషము. తలచినవి చెప్పటము, చెప్పినవి చేయటము. అప్పుడు మనకు యెట్టి యిక్కట్లు వుండవు. ఎట్టి అశాంతికి అవకాశము వుండదు. ఎట్టి దుఃఖము మనదరికి రాదు.

సంకల్పముల యొక్క ప్రభావాన్ని యింకా చక్కగా అర్థము చేసుకోటానికి ప్రయ
త్నించాలి. సంకల్పములు ఒక మనిషినుంచి మరొక మనిషికి ప్రయాణమవుతూవుంటాయి. ఇంతేకాదు
యెవరి చెడ్డనైనా మనము కోరుతూవుంటే మన సంకల్పములు అతనికి చెడ్డ చేసి అతనికి చేసిన చెడ్డ
కంటె పదింతలు యెక్కువగా మనకే వచ్చి చేస్తాయి. నీవు అనుకుంటావు నేను అతనికి చెడ్డ కోరు
తున్నాను. అతను యేనాడు నాశనమైతాడా, యేనాడు చెడిపోతాడా, యేనాడు భ్రష్టుడౌతాడా అని భావి
స్తుంటాము. కాదు కాదు. అవి మనము యెంత కోరినామో అంతకు పదింతలు అవి మనకే వచ్చి మనల
ను భ్రష్టు చేస్తాయి. కనుక దుస్సంకల్పములను మనము యే మాత్రము దరికి చేరనీయకూడదు.
అందరి మంచిని కోరాలి. అందరిని ప్రేమించాలి. దానికి నేనే సాక్షి. నేను అందరిని ప్రేమిస్తాను. దు
ష్టులను కూడను ప్రేమిస్తాను. నన్ను దూషించిన వారిని మరింత ప్రేమిస్తాను. నన్ను హాస్యము చేసిన
వారికి యింకా దరికి చేరుతాను. దాని వల్ల నాకు యెంతో ఆనందము కలుగుతూవుంటుంది.
కనుకనే My life is my message అంటాను. ఎప్పుడూ నాకు త్యాగమే. త్యాగమే గాని నాకు
యేనాడు భోగమనేది లేదు. ఆ త్యాగమే నా భోగము. కనుక బాలికలు అందరు కేవలము
భోగరాజులుగా తయారుకాకుండా త్యాగరాజులుగా, యోగరాజులుగా తయారుకండి. సమాజాన్ని
మనము పోషించాలి. సమాజము యొక్క ఔన్నత్యాన్ని మనము అనుభవించాలి అనే ఆశ కల్గిన
వాడు నాది నాది అనేది ఈశ్వరార్పణగావించి సమాజములో ప్రవేశించు. ముఖ్యముగా యీ సమా
వేశములో అందరు తెలుసుకోవలసినది ఒక్కటి వుంది. మన శక్తి కొలది మనము సేవలు చేద్దాము.
మితిమీరిన భారాలు మన తలపైన వేసుకోనక్కరలేదు. ఈ సేవలకు శరీరము, మనసూ రెండూ
కావాలి. చెయ్యాలనే సత్సంకల్పము. ఆ సంకల్పమును అనుసరించటానికి సరైన శక్తి సామర్థ్యములు
కల్గిన దేహము. ఇంతే కాని ధన కనక వస్తు వాహనాదులతో యే మాత్రము సంబంధము లేదు.

ఈ ధనమునకు స్థానాన్ని యివ్వటంచేతనే మన బలమంతా కూడను క్షీణించి పోతు
న్నాది. ఇచ్ఛాశక్తి మరింత క్షీణించి పోతున్నాది. వ్యక్తులలో ఒక విధమైన భేదాభిప్రాయములు పెరిగి
పోతున్నాయి. ఈ ధనమే మన క్షీణదశ కంతా మూలకారణము. అయితే నిత్యజీవితములో సంసారికి
ధనము అత్యవసరమే. ఆ ధనము యెంతవరకు వుంటుండాలంటే మన కాలికి బూట్సులు వేసుకుంటాము.
ఆ బూట్సులు సరైన కొలతగా వుండినప్పుడే మనము చక్కగా నడచటానికి సులభముగా వుంటుంది.
ఆ బూట్సులు కొంచెము లూజుగా వుంటే నడచటము చాలా కష్టమే. ఆ బూట్సులు టైట్‌గా వుంటే కూడ
ను నడచటం కష్టమే. కనుక ధనము అధికముగా వుండినా మనకు నష్టమే. ధనము చాలా తక్కువగా
వుండినా కష్టమే. మనము జీవించటానికి, యెవరైనా యింటికి వస్తే యింత పెట్టటానికి యింత మాత్రము
మనకు చాలు. వున్నవారే ధనము, ధనము అని ధనము కోసము పాటుపడి తాను దాసానుదాసుడైపోయి
జీవితములోపల ఒక వ్యర్థమైన జీవితము గావించుకుంటున్నాడు. ఈ దురాశను దూరము నెట్టండి.
ఎంత సంపాదించినాగాని యేనాడో ఒకనాడు వదలిపోక తప్పదు. ఇలాంటి దానినిమిత్తమై మనము

యెందుకింత ప్రాకులాడటం. నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించుకో. మన సంస్థలలోపల యీ డబ్బును ఆశించే దుర్బుద్ధిని మాత్రము యీనాటి నుండి మీరు దూరము చేసుకోండి. డబ్బుతో మనకు సంబంధము వద్దు. మనకు సేవతో సంబంధము. సత్సంకల్పమే నీవు పెంచుకుంటుంటే సర్వేశ్వరత్వమే నీకు అన్నీ అనుగ్రహిస్తుంది. కనుక మీరు చందాలు వేయటం కాని, మీరు యింకా యేదైనా పదిమందికి అన్ని విధాలా సేవలు చేయాలని వుంటుంటే డబ్బున్నవారు మనలో లేరా. వున్నవారు ఎవరో ఒకరో యిద్దరో దానికి సహాయపడి ఆ కార్యము మనము సాధించవచ్చు కదా. సాయి సంస్థలలో డబ్బు లేనివారు లేరు. కాని డబ్బు వుండి కూడను దరిద్రులైనవారు అధికముగా వున్నారు. డబ్బు వుండి కూడ సద్వినియోగము చేయనివాడే దరిద్రుడు. అలాంటి దరిద్ర జీవితాన్ని మనము గడపరాదు. త్యాగ జీవితాన్ని మనము గడపాలి. సాయి సంస్థలు దినదినమునకు పెరిగిపోతున్నాయి. ఈ దురాశలు మనము దూరము నెట్టాలి. కనుకనే యీనాటి నుండి కూడను మనము మన యొక్క సంస్థలలో సేవ భక్తి, త్యాగము, సహన భావము పెంచుకోవాలి. ఈ విధముగా వుండినప్పుడు మనలో కలతలు గాని, బాధలు గాని యే మాత్రము అవకాశముంటూ వుండదు. ఈనాడు కొన్ని విధములైన అభిప్రాయ భేదాలన్నీ యంటే మానవులలో యివి ధనముతో ప్రారంభమైనవే.

మరొక విషయాన్ని కూడను మనము గుర్తించాలి. నేను ఆఫీసు బేరర్ ను అని అధికారాన్ని చెలాయించటం మన సంస్థలలో వుండరాదు. అందరూ సేవకులే. నిజంగా యీనాడు యీ సమావేశము మనం జరుపుకుంటున్నామంటే చాలా పవిత్రమైన సమావేశమిది. వర్కర్లు కర్మలాచరించేవారు. Active వర్కర్లు అంటే యేమిటి. కర్మలను ఆచరించేవారి సమావేశమిది. ఇంతకుముందు యేదో State Presidents మీటింగని, యింకా ఆఫీసు బేరర్స్ మీటింగని యెన్నో జరిపాము. అవన్నీ వ్యర్థమైనవి. అందులో వర్కు చేసేవాడు ఒకడైనా నాకంటికి కన్పించలేదు. వేళ్లందరితో పని చేయించేది, నేను చేశానని గర్వంగా చెప్పుకొంటాము. ఇలాంటి దుర్బుద్ధులు మనలో దూరం చేసుకోవాలి. నాకు వర్కర్సే ప్రీతి. పని చేసేవాడు కావాలి. కనుక యీనాటి నుండి పని చేయనివాడు యెవడుండినా వాడిని తీసివేయండి. పని చేసేవారు పదిమంది వుండినా చాలు. కనుక యీ మన సమావేశములోపల నిర్ణయము గావించుకోవలసినది యేమంటే పని చేసేవారు కావాలి. వాని ధనమో, వాని హోదానో, కీర్తో, అపకీర్తో దానితో మాత్రము పని లేదు. మనకు పని చేసేవారు చిక్కాలి. అందరూ పని చేసేవారుగానే తయారు కావాలి. పని చేయకుండా వూరికే మాట్లాడేవాడు యీ సంస్థలో వుండటానికే అధికారి కాడు. ఒకరినొకరు విమర్శించేవారు యీ సంస్థలో వుండరాదు. అహంకారముగా అధికారాన్ని చెలాయించేవాడు అసలే వుండరాదు. ఎవరి శక్తికి తగినట్లు వారు పని చేసి నిరూపించాలి. అందుకోసమని దాసానుదాసుడను కావలెనురా. నేను నీ దాసులకు సేవ నే చేయవలెరా' అన్నాడు. కనుక మనము దాసానుదాసులుగా కావాలి. అప్పుడే దైవదాసులుగా రూపొందటానికి వీలవుతుంది. కనుక మనము పరదూషణను

యీనాటినుండి మనము త్యజించాలి. సర్వులనూ అన్నదమ్ములవలె ప్రేమించాలి. సర్వులయందు
భగవంతుడున్నాడనే విశ్వాసాన్ని పెంచుకోవాలి. ధనముతో సంబంధములేని సేవలు మనము ఆచ
రించాలి. అదియే సత్యసాయి సంస్థలయొక్క ప్రధానమైన ఆదర్శము.

మరొక విషయాన్ని కూడను మీరు గుర్తులో పెట్టుకోవాలి. ఒక్కొక్కరు మూడు నాల్గు
సంస్థలలో మెంబర్సుగా వుంటారు. అధికారులుగా వుంటారు. అనగా ఒక్క సాయీసంస్థలయందు
మాత్రమే కాదు ఒక సంస్థలో ఒక ప్రెసిడెంటుగా వుంటాడు. ఇంకో సంస్థలో యింకో ప్రెసిడెంటుగా వుంటా
డు. ఇంకో సంస్థలో సెక్రటరీగా వుంటాడు. సత్యసాయి సంస్థలో ఒక అధికారిగా వుంటాడు. ఈ మూడు
సంస్థలలో వుండిన వాడు యీ సంస్థతో సంబంధం పెట్టుకోటం చేత యేపనికూడను పూర్తి
చేయలేడు. ఎవరైనాసరే సత్యసాయి సంస్థ కాదు, మరొక సంస్థ కాదు యెక్కడ చేసినప్పటికినీ
తనయొక్క కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించాలి. నాల్గు సంస్థలతో సంబంధమువున్నవాడు యేసంస్థ
నుకూడ సంతృప్తి పరచలేడు. కనుక యిలాంటి సంస్థలలో వుండినవాడు సత్యసాయి సంస్థలో
చేరనక్కరలేదు. సత్యసాయి సంస్థలలోపల యెన్నిదానిలోనైనా వుండనీ సేవాదళములో వుండ
నీ, యింకా సత్సంగములో వుండనీ, స్టడీసర్కిల్లో వుండనీ, వీటిలో యెన్నిటిలోనైనా వుండవచ్చును.
ఇంకా రెండవ సంస్థలో మటుకు మెంబరుగా వుండటానికి వీలుకాదు. ఎన్నో రోజులుగా యిం
కొక సంస్థలో వుండినవాడు యిందులో వుండకూడదనే దుర్భావము కాదు. ఆ సంస్థలో తన కర్తవ్యా
న్ని సక్రమంగా నిర్వర్తించలేడు. ఈ సంస్థయందు కూడను సక్రమంగా వుండలేడు. ఏదైనా ఒక్కటి
మాత్రమే నీవు తీసుకొని దానిని పూర్తిగా సంతృప్తిగా ఆచరించటానికి ప్రయత్నించాలి. మీకందరి
కీ తెలుసు. రెండు గుఱ్ఱాలపైన సవారి యెంత ప్రమాదం కలిగిస్తుందో. కనుక రెండు సంస్థలలోపల
వుంటే మనం యేపనికూడను మనము పూర్తి చేయలేము. ఏదో అధికారం కోసం, పేరుప్రతిష్ఠల
కోసం మనము సంస్థలలో మెంబర్లు అవుతాము కాని యివి కేవలం ఒకవిధమైన దుర్గుణములుగానే
చెప్పవచ్చు. మీరందరు యీనాడు వర్కర్సుగా వచ్చారు. అన్నిపనులు మీవలనే జరుగుతున్నాయి. ఈ
నాడు అభివృద్ధిగాంచిన సమస్తకార్యములు మీవలననే జరిగినవి. ఇవియేవీ కూడను అధికారుల
వలన జరిగినవి కావు. మీరు నిజంగా సార్థకజీవులు. ఎంత త్యాగబుద్ధితో మీరు యీసేవలనాచ
రిస్తున్నారో అది స్వామికి తెలుసు. మీకు తెలుసు. నాకు యీసేవలే చాలు. యీసేవకులే చాలు. ఈ
త్యాగముకంటె మించిన గుణంలేదు. దీనికంటె మించిన ధనంలేదు. త్యాగులే భగవంతునికి
యోగులు. అయితే స్వామి యింత కఠినముగా చెప్పారని చెప్పి మీరు దీనినుంచి విసర్జించుకొని
పోవటానికి ప్రయత్నం చేయకూడదు. దీనిలో వుండే మరుపనిని సాధించాలి. ఇది మీ మంచి
కోసమనే చెప్పటము. మీరు సేవలంతా చేసి గొప్పకీర్తిని సంపాదించుకుంటే నాకొచ్చే ఫలి
తమేమి లేదు. మీరు సేవలు చేయకుండా దూరమైపోతే నాకొచ్చే నష్టమేమి లేదు. ఈ యొక్క
క్షేమము, యీ యొక్క నష్టము మీకే. కనుక సేవలలోనే వుండి ఒక పట్టును పట్టి దీనిని సాధించటా

నికి తగిన ధైర్యసాహసాలను మీరు సంపాదించుకోవాలి. ప్రేమస్వరూపులారా!

పట్టినదేదియో పట్టనే పట్టితివి
పట్టునెగ్గెడుదాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితివి
కోర్కె చెల్లెడుదాక కాలిచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితివి
అడిగినది డుదాక విడువకుండు
తలచినదేదియో తలచనే తలచితివి
తలపు తీరెడుదాక తలలకుండు
పోరుపడలేక తానైన ద్రోవవలయు
ఒడలు తెలియక నీపైన అడుగవలయు
అంతియే కాని యింకతమంతట తాము
తిరిగిపోవుట భక్తుని దీక్షకాదు.

కనుక యీసంస్థలను దినదినాభివృద్ధిగావించి సేవలయందే, భగవద్భక్తియందే మనయొక్క జన్మను సార్థకముగావించుకోవాలి.

ఇందూలాల్ షా చెప్పినట్లుగా మొట్టమొదటు దైవభక్తి అనగా spiritual wing రెండవది బాలవికాస్ అనగా విద్యకుసంబంధించినది. మూడవది సేవకుసంబంధించినది. ఈ మూడుసంస్థలు మనకు చాలు. ముచ్చటగా మూడు పెట్టుకొని ఆనందముగా మురిసిపోవచ్చును. దైవభక్తి కోల్పోవటంచేతనే మనభారతదేశం యీనాడు యిటువంటి దురవస్థలకు గురౌతూవచ్చింది. మనవారు భజనసెంటర్సు అభివృద్ధిగావించి యీ భజనలు చక్కగా ప్రాక్టీసు చేయటానికి ప్రయత్నం చేయాలి. శ్రావ్యమైన స్వరంతో వింటూవుంటే హృదయమంతా పొంగిపోవచ్చును. అపస్వరముల లో తాళవిరుద్ధముతో పాటలుపాడుతుంటే హృదయాము మండిపోతుంది. అనేకమంది హృదయాల్ని మనము ఉల్లాసంగా ఉప్పొంగింపచేయాలనుకుంటే పవిత్రమైన కంఠముతో పాడి భజనలు చేసి భగవంతుని కీర్తించినామంటే ఆహృదయమెంతో ఆనందాన్ని అనుభవిస్తుంది. సామూహిక భజనలు అభివృద్ధిగావించాలి. ఈ భజన ట్రైనింగు కూడను మనము అభివృద్ధిగావించాలి. పెద్దలు ముదిరిపోయినవృక్షాలే. ఇక యీ వృక్షాలు వంచటానికి వీలుకాదు. చిన్నచిన్నపిల్లలను యీనాటినుండి కూడను అభివృద్ధిగావిస్తూవస్తే వారి భవిష్యత్తులో మనభారతదేశానికి ఆధ్యాత్మిక ఆదర్శమును నిరూపించగలరు. బాలవికాస్ ను అమితముగా పెంచాలి. భజనసెంటర్సు పెంచాలి.

ఈ సేవాసంస్థలలోపల మనము విరివిగా అందరిని చేర్చుకోవాలి. సేవలు చేయటానికి అందరికి అధికారము వుంటుండాది. కనుక యిందులో ఒక్కొక్క అధికారి ఒక్కొక్కసేవాదళము

లేదరు. ఒక్కొక్కసారి వాడకము ప్రెసిడెంటు యీ విధమైనది లేకుండా సేవ చేసేటువంటి ఆగుంపులోనే పుత్రవయిన వానిని అధికారిగా పెట్టేసి వారు సేవా కార్యక్రమము లో యింతో అన్యోన్యముగా అభివృద్ధిగాం చుతుంది. ఈనాడు ఆఫీసు బేరర్సు మితిమీరి పోయినారు. ఎక్కడైనా ఒక సమావేశము జరుగుతూవుం దంటే అంతా ఆఫీసు బేరర్సు వుంటారుగాని పని చేసేవారు అక్కడ యెవ్వరూ కనుపించరు. ఒకరు ప్రెసిడెంటు అని, ఒకరు వైస్ ప్రెసిడెంటు అని, ఒకరు కన్వీనరు అని కోఆర్డినేట్ కమిటీ అని యేమిటే మిటీ యీ కమిటీలు అనవసరంగా పెరిగిపోతున్నాయి. ఎక్కడైనా మీరు చూడండి. ఎక్కడైనా మినిస్ట రు వస్తున్నాడంటే ప్రజలకంటె పోలీసులు యెక్కువగా వుంటారు. అట్లానే మన సమావేశములలోపల ఆఫీసు బేరర్సు అధికముగా వుంటారు. ఎవరికోసం యీ ఆఫీసు బేరర్సు మీటింగు పెట్టారో అర్థం కావ టంలేదు. ఆఫీసు బేరర్సును క్రమక్రమేణా తగ్గించాలి. తెలుగులో ఒక సామెత వున్నాది. మనుషులు పెరిగే కొద్దీ మజ్జిగ పలచన అయిపోతుందట. ఏదో ఐదు లేక ఆరు మంది వుంటే ఏదో గట్టి పెరుగు వేసుకోవచ్చు. జనులు యెక్కువైపోయారంటే నీళ్ళు పోస్తారు. అదే విధముగా మన సంస్థలలో పలకూడను ఆఫీసు బేరర్సు అధికమైపోతే పనులన్నీ పలుచనైపోతున్నాయి.

తరువాత యీ విధమైనటువంటి కూర్పులు మార్పులు యీ వరల్డు కౌన్సిలు వారు సరైన దృష్టిలో వుంచుకొని దీనిని సరైన మార్గానికి తెస్తారని ఆశిస్తున్నాను. నిజంగా యీ ఆర్గనైజేషనకు నాకు యెట్టి సంబంధము లేదు. నాకు మీకు సన్నిహిత సంబంధము వుండాలంటే ఇది యెప్పుడు దూరము చే యటానికి వీలులేదు. ఇది ఒకరితో కలిపించుకున్నది కాదు. కనుక ఆర్గనైజేషన్ లోపల అందరూ అన్యోన్యముగా చేరి, ఒక సోదర భావము చేత ఒకరినొకరు సంప్రదించుకొని సవరించుకోటానికి తగిన కృషి చెయ్యాలి. ఒకరితో ఒకరికి యెట్టి అభిప్రాయ భేదములు వుండరాదు. ఆ విధమైన భావము వుంటే సంస్థను మనము అభివృద్ధిగావించలేము. ఎవరైనా దానిని సరిచేసి వారిద్దరిని చేర్చటానికి తగిన కృషి చెయ్యాలి. అయితే ఒకటి యిన్నివేల మంది వుండినప్పటికి యిలాంటిది యీనాటి వరకు యెక్కడ పెరగలేదు. ఏదో కొంత స్వార్థము స్వప్రయోజనము వుండక తప్పదు. అందరూ ఒకే తల్లి బిడ్డలు. కవి చెప్తూ వుంటాడు

ఒక్క గూటి పిట్టలం
ఒక్క తీగ పువ్వులం
ఒక్క తల్లి పిల్లలం
ఒక్క జాతి బిడ్డలం
మనలో మనకు కలతలెందుకు

కనుక ఒకరితో ఒకరికి యే విధమైన అభిప్రాయ భేదములకు అవకాశము యివ్వరాదు. ఒక్క జాతి పౌరులం మనమంతా. అదే మానవజాతి. ఆ జాతిని దృష్టిలో పెట్టుకొని ముందంజవెయ్యా లి. అందరూ మానవులమే. మనకు జాతి మత కుల వర్ణ వివక్షత లేదు. సర్వమత సమ్మతమే

మన మతము. దీనినే అభిమతముగా విశ్వసించాలి. ఇలాంటి భేదములు లేకుండా అందరు మానవ జాతికి సంబంధించిన వారని, యే విధమైన కలతలు లేకుండా అందరు యీ సేవలలో పాల్గొని ప్రాచీన సాంప్రదాయము లో వుండిన మన ప్రాచీన సంపదను, ధర్మాన్ని మనము పోషించటానికి ప్రయత్నించాలి.

ఈ సేవయే గొప్ప సాధన. ఈ సాధన తప్ప యేదో కొత్త సాధన చేస్తున్నామంటే జపమాల తిప్పుతూ వుంటాడు యెక్కడో తిరుగుతూ వుంటుంటో మనసు. ఇలాంటి అర్థము లేని యెవంటి సాధనలు చేయటానికి ప్రయత్నించకండి. ధ్యానములోకి పోతుంటారు. ఆ ధ్యానము యెక్కడికి పోతుందో యే చాకలి ఇంటికో మంగలి ఇంటికో పోతుంటాది. ఈ దుర్గుణములతో యీ ధ్యానం చేసేదాని కంటె మనుషులను చక్కగా సేవించటానికి తగిన ప్రయత్నం చేయండి. నీవే దైవమై వుండి నీవు యింకెవరిని ధ్యానం చేయటం. కనుక యీ విశాల భావాన్ని మనం పెంచాలి. ఇది విశాలమైన ప్రపంచము. ఈ విశాలమైన ప్రపంచములో సంకుచితమైన భావములుండటం యెంత అవమానకరం. విశాలమైన ప్రపంచములో విశాలమైన భావాలు రావాలి. ఈ విశాల భావములు మనలో యేనాడు వస్తాయో ఆనాడే మనం దైవత్వాన్ని పొందగలం.

ఈనాడు మనము చేసే పూజలు గాని, ధ్యానము గాని, జపము గాని దైవాన్ని సంకుచిత పరుస్తున్నాము. విశ్వస్వరూపుడైన భగవంతుని మనము చిన్న ఫొటోలుగా చేసుకొని దానికి ప్రేమ కట్టి పూజలో పెట్టి అక్కడే వున్నాడు దేవుడని అక్కడికి పోయి నమస్కారం చేస్తే దైవత్వాన్ని యెంత కించపరచినట్లవుతుంది. దైవము యీనాటికి నీ మొక్కులకు చిక్కడు. ఈనాటి భక్తులు యెలా వున్నారంటే అంత అజ్ఞానములో మునిగి వున్నారు. ఏ విధంగా వున్నారంటే. దేవుడా యీనాడు పదిలక్షల లాటరి కనుక వచ్చిందంటే నీకు వెయ్యి రూపాయలిస్తాను. భగవంతుని తో పదిలక్షల రూపాయలు తీసుకొని వీడు భగవంతునికి వెయ్యి రూపాయలు యిచ్చే బుద్ధి తక్కువ యెంత చెప్పండి. వీడి తో వెయ్యి రూపాయలు తీసుకున్న భగవంతుడు వీడికి పదిలక్షలు యెలా యిస్తాడు. ఇంకా కొన్ని విపరీతమైన వికృతమైన కోరికలు. స్వామి. నాకు ఉద్యోగం కనుక లభించిందంటే వచ్చే నెల వచ్చినా వెంట్రుకలంతా నీకిస్తాను. ఈ తుచ్ఛమైన బొచ్చు నిచ్చి ఉచ్ఛమైన కోరికలు కోరటం యెంత అవివేకము. భగవంతునికి నీవు యివ్వవలసినది యేదీ లేదు. పుచ్చుకొనే భగవంతుడు ప్రత్యేకముగా మరొకడు లేడు. రెండు నీవే అయి వుంటున్నావు. ఈ భ్రమ వలనే నీకు. ఈ భ్రమలో వుండినంతవరకు బ్రహ్మను చూడలేవు. కనుక క్రమక్రమంగా యీ భ్రమను తొలగించుకోటానికి తగిన కృషి చేయండి. ఆత్మసాక్షాత్కారం కోసం మేము సాధన చేస్తున్నామంటారు. ఆత్మ సాక్షాత్తు సర్వత్ర వుంటూనే వున్నది. నీవు సాధన చేసేది ఆత్మకోసం కాదు. అనాత్మను తొలగించుకొనే కోసమని. అనాత్మను తొలగించుకుంటే ఆత్మ అక్కడే వుంటుంది. కనుక మనము యీ అనాత్మను తొలగించుకోటానికి తగిన కృషి మీరు చేయండి. ఈ అనాత్మ తొలగాలంటే సేవ ద్వారానే తప్ప అన్య మార్గములో యిది

721118716

లభ్యముకాదు. కనుక కలుగంగ కలుగంగ సేవ.సేవ. ఎవరిని మనము దూషించరాదు. ఎవరిని మనము
విమర్శించరాదు. ప్రేమతో సేవలలో మనము పాల్గొనాలి. ఈప్రేమసే పరమాత్మస్వరూపకముగా విశ్వసిం
చాలి.